
కథ



# దూరం

హెచ్చార్కె

"ఆC, యావయ్యయ్యు రూపాయ్లా..." పర్సు తీయడానికి జేబులో పెట్టిన చెయ్యిని అక్కడే వుంచి చిరాగ్గా అడిగాను ఆటో డ్రైవర్ని.

"మీటరు చూస్కో". కండ్లు లేవా అనడం ఒకటే తక్కువ. దాదాపు అదే అర్థంలో చూశాడతడు. నా మీద అరంగుళం ఎత్తుంటాడు. నాకన్న పుష్టిగా బలంగా వున్నాడు. యువకుడు. పేచీ కొనసాగిస్తే అలాంటి మాటలే ఇంకేవో అనడానికి సందేహించడని పర్సు బయటికి తీశాను.

"ఇంటి కాన్నుంచి ఇమ్లిబన్ బస్టాండుకు ఎన్నిసార్లు రాలా. ఎప్పుడూ నలవయ్యయ్యుకు మించలా. ఇవేం మీటర్లో ఏమో..." అంటూ అటువైపు నుంచి ఆటో దిగింది మా ఆవిడ, లక్ష్మి.

నేను చేత్తో పట్టుకున్న పర్సు వైపు చూస్తూ నాకూ ఆటో డ్రైవరుకు మధ్యగా దూరి ఉర్దూలో అడుక్కోడం మొదలెట్టారు ఇద్దరు బురఖా వేసు కున్న స్త్రీలు. వాళ్లు అడుక్కునే వాళ్లనిపించలేదు. తాము పోగొట్టుకున్న పర్సు నా చేతిలో చూసి లాక్కోడానికి దూసుకొచ్చినట్లనిపించింది.

పేగుల్లో పొంగుతున్న చిరాకును బలవంతాన అణుచుకుని, వాళ్లమీదుగా చేయి చాపి, తన సీట్లోంచి ఛాలెంజింగ్‌గా చూస్తున్న డ్రైవరుకు డబ్బులిచ్చి, సీటు మీంచి రెండు బ్యాగులు విసురుగా లాక్కుని, అప్పటికే ఇటు వైపు వచ్చిన లక్ష్మికి "పద పోదామ"ని మొరటుగా ఆర్డరేసి బస్టాండు లోనికి నడిచాను.

జూన్ నెల మొదటి వారం, శనివారం సాయంత్రం ఎంత రద్దీగా వుండాలో అంత రద్దీగా వుంది హైద్రాబాదు సెంట్రల్ బస్‌స్టేషన్. ఇంత అశాంత ప్రదేశాన్ని మహాత్మగాంధీ పేరిట పిలవడం ఇష్టం లేకనేమో, దీన్నింకా పాతపేరుతో ఇమ్లిబన్ అనే అంటూ వుంటారు చాలమంది. "ఇగ మనకు బస్సులో సీటు దొరికినట్టే, రిజర్వు చేసుకుందామంటే ఒద్దంటివి" తెచ్చిపెట్టుకున్న శాంతస్వరంతో అన్నాను లక్ష్మితో, తనవైపు చూడకుండా.

"ఏం జెయ్యాల. అయినోల్ల ఇంట్లో ఫంక్షన్. అదెప్పటికయితదో తెలదు. మధ్యలో వస్తే బాగుండదు. యా బస్సుకని రిజర్వ్ చేసు కుంటాం". నువ్వు బలే చెప్తావులే అన్నట్లు విసుగ్గా గొణుగుతూ ముందుకు నడిచిందామె. సొంత కళ్లతో రద్దీ చూశాక ఆమె మాటల్లో కొంచం అపరాధ భావన చేరినట్లుంది, నా మాట విననందుకు.

ఆ సంగతి అంతకన్న పొడిగించి లక్ష్మిని బాధ పెట్టడం ఇష్టంలేక ఊరుకున్నాను. లేకుంటే, ఫంక్షన్ల లాంటివి వున్నప్పుడు కూడా ప్రయాణాల్ని ఎలా ప్లాన్ చేసుకోవాలో తనను ఎజ్యుకేట్ చేయబోయి ఆ కాస్త సామరస్యాన్నీ చెడగొట్టుకునేవాణ్ని. ఇద్దరం గబగబా కర్నూలు బస్సులాగే చోటికి నడిచాం. అప్పుడే ఒక ఆర్డినరీ డొక్కు బస్సొచ్చి ఆగింది. దానిలోకి కూడా జనం లాకులెత్తిన వంతెన కింద నీళ్లలా తోసుకుంటూ ఎక్కేశారు.

"దగ్గరి వూల్లోల్లు. ఈ ఆర్డినరీ బస్సులు ఇట్నే ఉంటాయి" అంది లక్ష్మి, నన్ను అనునయించడానికో తనను అనునయించుకోడానికో. పక్క ప్లాట్‌ఫాం మీద చిత్తూరు వెల్లే హైటెక్ బస్సు వచ్చి ఆగివుంది. లక్ష్మి మాట నిజమే అయినట్లుంది. ఆ హైటెక్ బస్సు వద్ద అంత రద్దీ లేదు. డ్రైవరు

బస్సు పక్కనే నుంచుని వున్నాడు. టిక్కెట్లిచ్చేది కూడా ఆయనే. నేను భుజం మీద బ్యాగు సర్దుకుంటూ వెళ్లి "సార్, ఈ బస్సు కర్నూలు మీదు గా పోతుంది కదా..." అన్నాను, ఎక్కడా అని బస్సు మెట్లవైపు చూస్తూ. "పోతాది గాని, ఇంగ గంటన్నరగ్గాని కదలదు. అరగంటకు కర్నూలోల్ల హైటెక్కుంది" పొమ్మంటూ ఎందుకో నానుంచి ముఖం తిప్పుకుని మరోవైపు చూడ్డం మొదలెట్టాడు.

జూన్ నెల మొదట్లో బస్టాండుల్లో మనుషుల రద్దీ సంగతేమోగాని, గాలిలో కూడా ఒక రకం రద్దీ వుంటుంది. మూన్నెళ్లపాటు మన ఊపిరితో మనల్ని కాల్చి, మన చెమటలో మనల్ని ముంచెత్తిన ఎండాకాలం తనివి తీరక 'అప్పుడేనా' అని మొరాయిస్తుంటుంది. అదే సమయంలో వాన కాలం నీటివేళ్లు చొప్పించి సందు చేసుకుందామని ప్రయత్నిస్తుంటుంది. వేడికి తడికి మధ్య ఘర్షణ. దానికితోడు అక్కడ స్థలం కోసం తోసుకుం టున్న మనుషులు, వాళ్ల వూపిర్లు, వాసనలు. వాతావరణం వేడిగా జిడ్డుగా చీదర చీదరగా వుంది. హైటెక్ బస్సులో సీటు దొరికితే, బస్సు కదిలి కాస్త గాలి వీస్తే, ఏ చెత్త వీడియోనో వేస్తే, చూస్తూ పోవచ్చు. అది కుదిరేలా లేదు. దానికి తోడు మనసులో చిన్నవీ పెద్దవీ ఏవేవో మంథరాలు. పనులకు సంబంధించినవి, బంధువులవి, స్నేహితులవి ఏవేవో చిక్కుముడులు. మెలకువలో పీడకలలు. ఉన్నచోట వుండనీయడంలేదు. నొప్పెట్టే భుజాలమీద బ్యాగును కుడి ఎడమలు మార్చు కుంటూ, మనుషుల హడావిడి మధ్య చోటు చేసు కుంటూ, సిగరెట్ వెలిగించి, పచార్లు చేయడం మొదలెట్టాను.

"ఆ బ్యాగు ఈడ నా కాడ పెట్టు" అంది లక్ష్మి. తన బ్యాగు కాళ్లదగ్గర పెట్టుకుని నిర్లిప్తంగా నుంచుని వుందామె. అంతవరకు ఆ ఐడియా తట్టనందుకు నన్ను నేను తిట్టుకుంటూ వెళ్లి నా బ్యాగును లక్ష్మి పాదా క్రాంతం చేశాను. "ఇంత వేడిగా వుంది. ఇప్పుడా పాడు సిగరెట్ తాక్కపోతేనేం" అని మరో చురక అంటించిం దామె. బ్యాగు విషయంలో పాయింటు కొట్టేసిన ఉత్సా హం ఆమె మాటల్లో. "పబ్లిక్ ప్లేసు, ఫైనెయ్యారా" అని కూడా అంది, కాకీ రంగు కోసం అటు ఇటు ఆశగా చూస్తూ.

బస్టాండులో సిగరెట్ తాగి ఫైనేయించుకున్న అనుభవమేదీ లేదు నాకు. కసిగా మరో సిగరెట్ వెలిగించి రెండు దమ్ములు పూర్తి కాకముందే కర్నూలు ప్లాట్‌ఫాం మీదికి ఓ ఎక్స్‌ప్రెస్ బస్సొచ్చి ఆగింది. అంటే ఇప్పుడిప్పుడే హైటెక్ లేదన్నమాట. ఆ మాట స్ఫురించగానే లక్ష్మిని పిలుస్తూ పరిగెత్తాను. నన్ను మొరటుగా తోసేవాళ్లను మొరటుగా తోసు కుంటూ ఎక్కేశాను. టూ సీటర్ సీటు దొరికితే లక్ష్మితో కబుర్లు చెప్పు కుంటూ వెళ్లొచ్చని బస్సు లోపలి భాగాన్ని స్కాన్ చేశాను. ఒకదాని మీద బయటినుంచి పడేసిన వాటర్ బాటిల్. ఇంకోదానిమీద కర్చీఫ్. మరికొన్ని చోట్ల బయటినుంచి పడేసిన వాటర్ బాటిల్. ఇంకో దానిమీద కర్చీఫ్. మరికొన్నిచోట్ల బయటినుంచి వేల్లాడుతూ చేతులు సీట్లమీదికి జార్చి, వీటిని తాకితే ఖబర్దార్ అని కిటికీల్లోంచి చూస్తున్న తలకాయలు. మిగిలిన వాటిలో నాకన్న బాగా పరిగెత్తిన యోధులు. బస్సు మధ్యలో ఓ త్రీ సీటర్ ఖాళీ. వెంటనే వెళ్లి రెండు సీట్లు కవరయ్యేలా కర్చీఫ్ పడేసి అక్కడే నుంచున్నాను. లక్ష్మి మా రెండు బ్యాగులు, తన షోల్డర్ బ్యాగు, వాటర్ బాటిల్‌తో రద్దీ మధ్య సర్కస్ ఫీట్లు చేస్తూ వచ్చి కిటికీ సీటు ఆక్రమించేవరకు కదల్లేదు.

వెనక్కి వాలడానికి వీల్లేని ఆ స్ట్రెయిట్ సీట్లలో ఐదారు గంటలసేపు అని నాకు గుర్తుకు రాగానే నా మెడకు తన స్పాండిలోటిస్ గుర్తొచ్చింది. నా లోపలి, బయటి రద్దీతో ఐదారు గంటలు ఈ సీటులో గడపడమంటే భయమేసింది. కిందికి వెళ్లి రెండు న్యూస్‌పేపర్లు కొనుక్కొచ్చాను. 'పేపర్ పొద్దున్నే చదివావుగా' అంటూ నవ్వలేదు లక్ష్మి.

ఇంతలో, మరో గంటన్నరగ్గాని కదలదన్న హైటెక్ బస్సును మా కండ్ల ముందే బయల్దేరదీశాడు అదే డ్రైవరు. మా ఎక్స్‌ప్రెస్ ఇప్పుడిప్పుడే కదిలేట్లు లేదు. 'దొంగ నా...' అన్నట్లు కోపంగా చూశాను అబద్ధం చెప్పిన చిత్తూరు డ్రైవరువైపు. తనకు నా చూపులు గుచ్చుకున్నట్లున్నయ్. అరచేత్తో ముఖం రుద్దుకుంటూ వెళ్లిపోయాడతడు.

పెనం మీంచి తీసిన బట్టతో ముఖం తుడుచుకున్నట్టున్న జిడ్డు జిడ్డు వేడి. ఈ మున్సిపాలిటీ చెత్తబండి ఇంకా కదల్దేం అనుకుంటూ కూర్చు న్నాను. నా ఎడంపక్క సీటింకా ఖాళీగా వుంది. అక్కడ ఎవరో వున్నా రనుకుని ఎవరూ రాకపోతే బాగుణ్ణని కాసేపు ఆశపడ్డాను. బస్సు కదు ల్తుండగా ఒకాయన వచ్చి కూర్చున్నాడు. చాలీచాలని సీటులో చేతులు ముడుచి ఒళ్లో పెట్టుకున్నాను. ఆయన ఏదయినా తాలూకా స్థాయి ఆఫీసులో పని చేస్తూ వుండొచ్చు. నాలాగే నడివయసు మనిషి. ప్యాంటు షర్టు వేసుకున్నాడు గాని పల్లెటూరి వాలకం పోలేదు. చాల కాగితాలున్న ఒక ప్లాస్టిక్ ఫోల్డరును జాగ్రత్తగా ఒళ్లో పెట్టుకున్నాడు.

బస్సు బయల్దేరాక నేను న్యూస్‌పేపరు విప్పుతుంటే, కొన్ని పేపర్లు తనకు ఇమ్మంటాడా అన్నట్లు అనీజీగా చూశాడాయన నా వైపూ పేపర్ వైపు.అడిగితే ఇవ్వకతప్పదు. ఇస్తే నా సొమ్మేంపోదు.కాని ఇవ్వాలనిలేదు.

నా లోపల మంద్రస్థాయిలో ఏదో కసి. ఒకరి మీద అనికాదు. అందరి మీద. తన కవిత చదివి బాగుందని వుత్తరం రాస్తే, పనిమాలా ఫోన్ చేసి, నా కవిత్వం గురించి ఒక్క మాటయినా లేకుండా, తన పుస్తకాలు ఫలానా షాపులో దొరుకుతాయి వెళ్లి కొనుక్కోమంటూ తన భోటి వారి సాహిత్యం సార్వకాలీనత, సార్వజనీనతల గురించి నా పరిమిత జ్ఞానాన్ని అపరిమితం చేసి వదిలిన కవయిత్రి మీద, నాకు అటుపక్క కూర్చున్న లక్ష్మి మీద, అప్పు అడగడానికి తప్ప పలకరించని బంధువుల మీద, ఇటుపక్క కూర్చున్న తాలూకాఫీసు ఉద్యోగి మీద, అవి బెదురుచూపులో దొంగచూపులో తెలియని ఆయన అనీజీ చూపుల మీద, బస్సు కదిలి వెళ్తున్నా జిడ్డు చెమటను ఆర్పని వేడిగాలి మీద, ఐదో పదో నా నుండి ఎక్కువగా వసూలు చేసిన ఆటో డ్రైవరు మీద, నాకు సునాయాసంగా అబద్ధం చెప్పి అనాయాసంగా తుర్రుమన్న చిత్తూరు బస్సు డ్రైవరు మీద, నాకూ ఆటోడ్రైవరుకు మధ్యలో దూరి నన్ను



**"ఆ బ్యాగు ఈడ నా కాడ పెట్టు" అంది లక్ష్మి. తన బ్యాగు కాళ్లదగ్గర పెట్టుకుని నిర్లిప్తంగా నుంచుని వుందామె. అంతవరకు ఆ ఐడియా తట్టనందుకు నన్ను నేను తిట్టుకుంటూ వెళ్లి నా బ్యాగును లక్ష్మి పాదా క్రాంతం చేశాను. "ఇంత వేడిగా వుంది. ఇప్పుడా పాడు సిగరెట్ తాక్కపోతేనేం" అని మరో చురక అంటించిందామె.**

అపరాధ భావనకు గురిచేసిన బిచ్చగాళ్ల మీద, న్యూస్ పేపరు సాహిత్యం పేజీలో కవిత్వం పేరిట అచ్చేసిన చెత్త మీద, దాని అడుగున సంతకం చేసిన మమాకవి మీద, కర్నూలులో మేము మొదలెట్టి చాలరోజులయినా ముందుకు సాగని పనుల మీద, వాటిని ముందుకు సాగన్వివకపోవడమే తమ డ్యూటీ అన్నట్లు ప్రవర్తించే ప్రభుత్వాధికారుల మీద... చేతిలోని న్యూస్ పేపర్ గాలికి ఆయనవైపుగా విచ్చుకుని రెపరెప లాడింది. దాన్ని సరిగ్గా మడుస్తూ సారీ చెప్పాలా అన్నట్లు ఆయనవైపు ఓరగా చూశాను. ఆయన అదే అనీజీ చూపుల్తో ఒక క్షణం చూసి వూరుకున్నాడు. పేపర్లలో వార్తలే కాకుండా నాకు ఆసక్తిలేని స్పోర్ట్స్ పేజీలుకూడా క్షుణ్ణంగా చదివేసి నాకూ లక్ష్మికి మధ్య పెట్టేశాను. బస్సు ఏదో ఊరు దాటిపోతోంది. బయటి నుంచి ఏదో కుళ్లు వాసన. ముక్కు సర్దుకున్నాను. "చచ్చిపోయిన కుక్కలను ఊరు బయట పారేస్తుం టారు" అంది లక్ష్మి దుర్వాసనకు కారణం వూహిస్తూ.

ఎప్పుడో ఇమ్లిబన్ బస్టాండులో తాగిన ఒకటింబావు సిగరెట్. నికొటిన్ నిండుకుందని రక్తం ఏడుపు. ఓ కప్పు టీ, ఓ దమ్ము సిగరెట్... అనుకుంటూ వుండగా బస్సు జడ్చెర్ల బస్టాండులోకి సర్రున తిరిగింది. వెంటనే దిగేద్దామని నేను లేస్తుంటే, ఆయన నా కన్నముందే లేచి, ప్లాస్టిక్ ఫోల్డరు పట్టుకుని ముందుకు నడిచాడు. కాస్త జరగమని అడగడా నికి ఆయనతో మాట్లాడాల్సిన అవసరం లేకపోయింది. టీ తాగి, టీ మధ్యలో వెలిగించిన సిగరెట్ బట్-మినహా తాగేసి, డ్రైవరు హార్న్‌తో చేసే కర్కశ శబ్దాలు వింటూ బస్సెక్కాను. నా రెండో సీట్లోకి వెళ్లడానికి ఆయనను సర్దుకొమ్మని అడగాల్సిన అవసరం కూడా రాలేదు.

*గాలి కాస్త చల్లబడినట్లుంది. లేక, సేద తీర్చే ఆ చల్లని గాలి నా లోపల్నుంచి వీస్తోందా? పేపరు తీసి సాహిత్యం పేజీలో కవితను మళ్లీ చదివాను. ఒక్కోసారి అందమైన వూహలు స్ఫురిస్తాయని, ఆ స్ఫురణ కోసం కవి వూహిస్తూనే వుండాలని చెబుతున్న కవిత. చాల బాగుంది ఔను. కవులే అని ఏమిటి, ఎవరైనా అంతే, వూహిస్తూ వుండాలి, ఆశిస్తూ వుండాలి.*

మాట చెప్పరాదా అని తన ఉద్దేశం. "వచ్చేట్టయితే వస్తాడు లెద్దూ" అని నేను కూర్చుండిపోయాను.

బస్సు కదిలింది. ఆయన రాలేదు. జడ్చెర్లలో ఎక్కినవాళ్లలో కొందరు ఆ సీటు మీద నేనుంచి న్యూస్ పేపర్ చేసి మరింత వెనక్కి వెళ్లి పోయారు. మళ్లీ అదే ఆశ, ఎవరూ రావొద్దని. బస్సు కాస్త ముందుకు కదిలాక హడావిడిగా లోపలికి వచ్చాడొక యువకుడు. "ఇక్కడెవరయినా వున్నారా" అని అడిగాడు. "ఎవరో వున్నారు. ఇంకా రాలేదేమయ్యాడో" అన్నాను. "ఆయన వస్తే లేస్తాలె"మ్మని కూర్చున్నాడతడు, న్యూస్‌పేపర్ తీసి నా చేతికిస్తూ.

కర్నూలు చేరడానికి ఇంకా సగానికి మించి ప్రయాణం వుంది. మా హెడ్డాఫీసు హైద్రాబాదులోనే గాని మా సంస్థ కర్నూలు కేంద్రంగా చుట్టు పక్కల పల్లెల్లో రైతులతో పని చేస్తోంది. అక్కడ నలుగురు కార్యకర్తలు చేశామని చెబుతున్న దానిలో నిజమెంత, అత్యుత్సాహంతో చెబుతున్న దెంత అనేది నన్ను తొలుస్తున్న ఆలోచనల్లో ఒకటి. కర్నూలు దగ్గరయ్యే కొద్దీ ఆ ఆలోచనే ముఖ్యమవుతోంది. ప్రభుత్వాధికారులతో కలిసి పని చేయాల్సి రావడం వల్ల ఏదీ సకాలంలో సరిగ్గా జరగదు. గ్రామాల్లో కార్యకర్తలకు జీతాలు రేపొస్తాయని ప్రతిరోజూ చెబుతూ పని చేయాలి. రేపట్నుంచి కొన్ని రోజులు అదే పని నాకు. అది తలుచుకునేకొద్దీ చికాకు మరింత ఎక్కువవుతోంది. ఇక నన్ను ఆదుకోడానికి న్యూస్‌పేపరు స్పోర్ట్సు పేజీలు కూడా లేవు. ఒక్కడినే వెళితే, కర్నూలు చికాకులు మరింత బాధ పెడతాయని 'మీ పిన్నమ్మను చూసి రావొచ్చు కదా' అని ఆశ పెట్టి లక్ష్మిని కూడా నాతో బయల్దేరదీశానీ సారి.

బస్సు ఉన్నట్టుండి ఆగింది. ఎదురుగా వస్తూ ఓవర్‌టేక్ చేసుకుంటున్న లారీలేవో అడ్డొచ్చినట్టున్నాయి. ఆగుతున్నప్పుడు బస్సు ఇచ్చిన చిన్న కుదుపుకి ఎదుటిసీటు పైభాగం పట్టుకుంటూ "ఓ భగవాన్" అని గలగల నవ్వేశాడు నాపక్కన యువకుడు. అప్పుడు చూశాను ఆ అబ్బాయి వైపు.

"నిన్న రాత్రి పూనేలో బయల్దేరినప్పట్నుంచీ.. ట్రాఫిక్ జాములే. పెబ్బేరు చేరేలోగా ఇంకెన్నో... భగవాన్" అన్నాడతడు అలసట తెర కింద దాగని నవ్వు మొగంతో. అతడు భగవాన్ అనే మాటను పలికే తీరు వింతగా వుంది. అది నిట్టూర్పులా లేదు. అతడికి భగవంతుడితో పరిచయమేమో అన్నట్లుంది.


"పూనే నుంచి..." అర్థవంతంగా చూశాను అతడివైపు. హైద్రాబాదు-కర్నూలు బస్సులో పూనే నుంచి వచ్చే ప్రయాణీకుడు!?

"ఆc, నిన్న రాత్రి పూనే నుంచి బయల్దేరాను బస్సులో. అది ఈరోజు మధ్యాహ్నం మూడింటికి హైద్రాబాదుకు చేర్చింది".

"మరి హైద్రాబాదు నుంచి డైరెక్టు బస్సు...?"

"దొరకలేదు. ఏదో ఒకటని ఎక్కేసి జడ్చెర్లకు చేరాను... ఎక్కడ చూసినా ట్రాఫిక్‌జాములే" అని ఒక్క క్షణం ఆగి "భగవాన్" అన్నాడు.

ఆ అబ్బాయికి ముప్ఫయ్యేళ్లుండీ లేక. కాఫీ రంగు ప్యాంటు. లేత ఎరుపు పెద్దగళ్ల శ్లాక్. బలహీనంగా లేడు గాని, బక్కపలచని మనిషి. దీర్ఘ ప్రయాణంలో అలిసిపోయి వుంటాడు. దానికి తోడు వేడివుక్క గాలి. మనిషి కాస్త నలిగినట్లున్నా నవ్వుతున్నట్లున్న కళ్లూ, పెదిమలు. తన



బ్యాగును కింద సీటుకు అటు పక్క పెట్టేశాడు. సన్నటి మనిషి. సీట్లో ఇబ్బంది లేకుండా కూర్చున్నాడు.

"మీది కర్నూలా?" మాట కలుపుతూ అడిగాను.

"ఆc, పూనేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నా. పెబ్బేరులో ఆగి ఫ్రెండ్సును చూసి కర్నూలుకు వెళ్లాలి".

"కర్నూలుకు బాగానే వస్తుంటారా, కర్నూలు మీకు బాగా తెలుసా?" అని అడిగాను. మాది కర్నూలు జిల్లాయే. కాని, అక్కడ నా పరిచయాల్ని ఒక చేతివేళ్లమీద లెక్క పెట్టొచ్చు. మా కార్యకర్తలు, కొందరు రైతులు తప్ప కర్నూలులో ఎవ్వరు తెలియకపోవడం నన్ను ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఒకటి.

"ఐదారు నెల్లకు ఒకసారి వచ్చి, వచ్చినప్పుడు ఒకరోజు ఉండి వెళ్తుంటాను, అంతే" అది మామూలు వ్యవహారమే అన్నట్లు చెప్పాడా అబ్బాయి.

"ఈ సాఫ్ట్‌వేరోళ్లంతా ఇంతే. ఇంటికి వెళ్లడం, అమ్మ నాన్నలతో గడపడం కూడా టైం వేస్ట్ అనుకుంటారు" అంది నిష్ఠుర స్వరంతో మా లక్ష్మి. తను మాట్లాడుతోంది ఆ అబ్బాయి గురించి కాదని, అతడి జాతికే చెందిన మా అమ్మాయి గురించి అని నాకు మాత్రమే తెలుసు.

మాటల మధ్యలో అతడు చదివింది బిటెక్ అని తెలిసింది. కాసేపుండి సందేహిస్తూనే "బిటెక్ ఏ కాలేజీలో చదివావ"ని అడిగాను. అతడు చెప్పాడు. ఏ బ్రాంచ్ అని అడిగాను. చెప్పాడు. లోలోపల ఏదో సంతోషం మొలకలెత్తుతుండగా, ఏ సంవత్సరం బ్యాచ్ అని అడిగాను. ఈసారి అతడి వాక్యం పూర్తికాకముందే అడ్డుపడుతూ "నీకు కరుణ తెలుసా, కరుణ అని ఒక అమ్మాయి మీ క్లాసులో..." అని మొదలెట్టిన నా మాటను నేను కూడా పూర్తి చేయలేకపోయాను.

"మీరు... కరుణ మీకు..."

"కరుణ మా అమ్మాయి" అన్నాను చాల సంతోషంగా.

ఇక మా ఇద్దరి మధ్య కొత్తదనమే లేదు. ఆ అబ్బాయి, కరుణ మంచి ఫ్రెండ్స్. మాలాగే కరుణకూ సాహిత్యంవంటి పిచ్చి వ్యాసంగాలంటే ఆసక్తి అని అతడికి తెలుసు. ఆ అబ్బాయికి 'ఓషో' అంటే వల్లమాలిన అభిమానమని కరుణకు, తన ద్వారా నాకు తెలుసు. 'నా కోసం ఓషో పుస్తకాలు పంపిస్తానని చెప్పి వాగ్దానభంగం చేసింది నువ్వేగా' అని అతడికి సర్దాగా గుర్తు చేశాను. అతడు ఔనని ఒప్పికోలుగా నవ్వేస్తుండగా బస్సు పెబ్బేరులో ఆగింది.

"భగవాన్... ఈ పెబ్బేరు అప్పుడే రావాలా, మీతో కరుణ సంగతులు మాట్లాడుతూ మరి కాసేపుంటే బాగుండేది" అంటూ లేచాడతడు.

"ఔను. మాక్కూడా. నీతో మాట్లాడుతుంటే కరుణతో గడుపుతున్నట్లే వుంది" అంది అంతవరకు ఏమీ మాట్లాడని లక్ష్మి. మా ఫోన్ నెంబరు రాసుకుని అతడు దిగిపోయాడు. బస్సు బయల్దేరే వరకు కిటికీ దగ్గర ఆ యువ దరహాసం. అక్కడ మా చిట్టితల్లి నుంచున్నట్లే వుంది.

బస్సు బయల్దేరినా లోలోపల అదే ఆహ్లాదం. మేము తన మిత్రుడిని కలిశామని కరుణకు ఓ అందమైన ఇ-మెయిల్ పంపాలని అందమైన ఊహలు.

గాలి కాస్త చల్లబడినట్లుంది. లేక, సేద తీర్చే ఆ చల్లని గాలి నా లోపల్నుంచి వీస్తోందా? పేపరు తీసి సాహిత్యం పేజీలో కవితను మళ్లీ చదివాను. ఒక్కోసారి అందమైన వూహలు స్ఫురిస్తాయని, ఆ స్ఫురణ కోసం కవి వూహిస్తూనే వుండాలని చెబుతున్న కవిత. చాల బాగుంది ఔను. కవులే అని ఏమిటి, ఎవరైనా అంతే, వూహిస్తూ వుండాలి, ఆశిస్తూ వుండాలి అనుకుంటూ కవితను ఆప్యాయంగా నిమిరాను. వర్తి న్యూస్ ప్రింటును ముట్టుకున్నట్లు లేదు. కవినే ముట్టుకున్నట్లుంది. చలివేంద్రం వద్ద చల్లని కుండను ముట్టుకున్నట్లుంది.

యువ ఓషో మిగిల్చి వెళ్లిన సంతోషంలో చూసుకోలేదు. ఎడంపక్క ఎవరిదో చెయ్యి తగిలింది. 'ఖాళీ' సీటు వైపు చూశాను. అది ఖాళీగా లేదు. పెబ్బేరు వద్దనే ఎవరో ఎక్కారు. ఈసారి ఆసక్తిగా చూశాను. 'ఓషో' కన్న కాస్త చిన్నవాడయ్యుంటాడు. కాకపోతే కాస్త బొద్దుగా వున్నాడు. నిండు బుగ్గలతో గుండ్రని ముఖం. నల్లరంగు ప్యాంటులో

ఎల్లో షర్టు దోపి బెల్టు పెట్టాడు. బెల్టు బకిల్ బస్సు లోపలి నీడలో కొద్దిగా మెరుస్తోంది. అతడి ముఖం అప్పుడే ఏదో యాక్టివ్ పనిలో వుండి వచ్చినట్లు వుత్సాహంగా వుంది.

"కర్నూలా?" అని అడిగాను. అడిగిన వెంటనే గుర్తొచ్చింది. నేను ఒషోను నేరుగా అడిగిన మొదటి ప్రశ్న అదే.

కాదుట. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏదో వూరిపేరు చెప్పాడు.

"అయితే, అనంతపురం జిల్లా మడకశిరలో పని చేస్తున్నా" అని అడక్కుండానే చెప్పాడు ఈ అబ్బాయి కూడా ఒషోలాగే.

"అక్కడ ఏం చేస్తారు?"

"హార్టికల్చర్ కన్సల్టెంటు ఉద్యోగం సార్" అన్నాడు చాల ఉత్సాహంగా. అంటే ఏమిటని నేను అడగడమే తరువాయి, ఉద్యాన, వ్యవసాయ శాఖల్లో ఉద్యోగవ్యవస్థ నిచ్చెనమెట్ల గురించి, అందులో తన స్థానం గురించి, మడకశిర మండలంలో తోటల పెంపకం గురించి, పురుగు మందులు వాడకుండా పండించిన దానిమ్మ పండ్ల గురించి, ఆ మంచి పని చేసిన రైతుల గురించి, వారిని ఆదర్శ రైతులుగా గుర్తించని రాజకీయాల గురించి ఆ అబ్బాయి ఒక నిమగ్న స్వరంతో చెబుతుంటే నేను కర్నూలు వెళ్లాక చేయాల్సిన పనుల మీద కొత్త ఇష్టం పుట్టుకొచ్చింది.

నేను చేస్తున్న పనుల గురించి తనకు నాకన్న బాగా తెలుసు. పాలెంలో అగ్రికల్చరల్ డిప్లొమా చేశాడనగానే అక్కడ చదువుకుని రైతులలో పని చేస్తున్న నా స్నేహితుడొకరి పేరు చెప్పాను. తను ఈ అబ్బాయికి తెలియడమే కాదు, ఫ్రెండు కూడా. ఆయనకు నేను ఫ్రెండును కాబట్టి తనకూ ఫ్రెండునే అన్నట్లు మాట్లాడసాగాడు. కర్నూలు జిల్లాలో నాకు అవసరమయ్యుండి, పరిచయంలేదే అని నేను బాధ పడుతుండిన కొందరు అధికారులు కూడా ఆ అబ్బాయికి తెలుసు.

'ఎంత చిన్న ప్రపంచం' అనుకున్నాను నాలో నేను.


తను ఉద్యోగంలో చేరి ఏడాది మించకపోయినా, బహుశా అందువల్ల నేనేమో, తను చేస్తున్న పని గురించి గొప్ప మమకారంతో మాట్లాడుతున్న అతడిని చూస్తుంటే నాలో మిగిలివున్న దిగుళ్ల ఒక్కొక్కటి గాలి బుడగల్లా ఎగిరిపోయాయి. నేను కర్నూలు వెళుతున్నది పని మీద కాకుండా విహారయాత్రకు అన్నట్లు ఫీలింగ్ కలిగింది నాకు.

అవసరమైతే కాంటాక్ట్ చేయమని తన ఫోన్ నెంబరు రాసిస్తుండగా బస్సు కర్నూలు బస్టాండులో ఆగింది. అతడు లేచి వెళ్తుంటే చాల మంది స్నేహితులు లేచి వెళ్తున్నట్లనిపించింది. బస్సు వెనుక నుంచి వస్తున్న వాళ్లతో పోటీ పడకుండా, వాళ్లంతా వెళ్లేవరకు కూర్చుని, అటకమీంచి బ్యాగులు నిదానంగా తీసుకుని, చిట్టచివర నింపాదిగా బస్సు దిగాం మేమిద్దరం.

నేను గమనించలేదు. గమనించీ మరిచిపోయానో. మేము ప్రయాణంలో వుండగా చిన్న వాన కురిసినట్లుంది. గాలి చల్లబడింది. కర్నూలు బస్టాండు కూడా రద్దీగానే వుంది. ఈ రద్దీ చూసి విసుగు, చిరాకు కలగడం లేదు.

"ఏంటి, చాల సంతోషంగా వున్నావ్" అడిగింది లక్ష్మి నా పక్కన నడుస్తూ.

తనవైపు తల తిప్పి ఇష్టంగా నవ్వాను. నవ్వు ఒక మంచి అంటు




వ్యాధి. లక్ష్మి ముఖంలో నాకిష్టమైన మురిపెం నవ్వు. తన కింది పెదిమ మీద నాకిష్టమైన కాంతిరేఖ. బ్యాగు లేకుండా విడిగా వున్న నా కుడిచేతిని బ్యాగు లేకుండా విడిగా వున్న తన ఎడమ చేత్తో పట్టుకుంది.

"... అనుకుంటాం గాని, మనుషులు ఒకరికొకరం రెండు షేక్‌హాండ్స్ దూరమే కదూ..." అన్నానేను.

"అంటే...?" అని అడిగి ఒక్క క్షణం తరువాత తానే సర్దుకుని "అవ్, నిజమే" అంటూ ఆటోలవైపు దారి తీసింది. మూడు నాలుగు ఆటోల వాళ్లు మమ్మల్ని చుట్టుముట్టారు. మొదట ముందుకొచ్చిన ఆటోలో బ్యాగు పడేసి లక్ష్మి పిన్నమ్మవాళ్ల ఇల్లు అడ్రసు చెప్పి, "ఎంత?" అని అడిగాను. కర్నూలులో ఆటోలకు మీటర్లుండవు.

డ్రైవరు కాసేపు అటు ఇటు చూసి "పదిహేను రూపాయలు" అన్నాడు.

"కిలోమీటరు దూరం వుండదు, అంతనా..." అంటోంది లక్ష్మి.

"పోనిద్దూ లక్ష్మీ, ఇంటిదాకా వస్తాడు కదా..." అని నేను ఆటో ఎక్కి కూర్చున్నాను. లక్ష్మి కూడా కూర్చుంది.

ఆటో కదుల్తుండగా ఒక ముసలాయన ఏ భాషలోనూ మాట్లాడకుండా మౌనంగా చేయి చాపాడు నా వైపు. నేను జేబు చూసుకుంటే చిల్లర లేదు. లక్ష్మి ఒసారి నా ముఖంలోకి చూసి నవ్వుకుంటూ, తన షోల్డర్ బ్యాగులో వెదికి, రూపాయి కాసు తీసి, నా మీదుగా చేయి చాపి ముసలాయన చేతిలో పెట్టింది.

ఆటో కదిలింది.

ఈసారి కర్నూలు రోడ్లు మరీ అంత గలీజుగా లేవు అనిపించింది.

అప్పుడే ఏ ఓపెన్ డ్రెయిన్‌లోనో తానమాడి లేచి ఠరాకత్‌గా వెళ్తూ మా ఆటోను అరనిమిషం ఆపిన పంది కూడా మరీ అంత గలీజు అనిపించలేదు.

"ఆయనను పలకరించాల్సింది నేను" అన్నాను రూల్సెరుగని కర్నూలు ట్రాఫిక్‌లో డ్రైవరు విన్యాసాల్ని మెచ్చికోలుగా చూస్తూ.

"ఎవరిని...?" అడిగింది లక్ష్మి.

"ఇమ్లిబన్‌లో మనతో బస్సెక్కి జడ్చెర్లలో ఆగిపోయాడే... ఆయన్ని"

"... ... ..." ఏమీ అనకుండా నా కుడిచేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుని ప్రేమగా నొక్కింది లక్ష్మి.

## నిమిషానికి



"ఎలావున్నావు?" అని అడిగాడు రమేష్ సీటు దగ్గరకు వచ్చి రాము.

"బాగానే వున్నాను" అన్నాడు రమేష్.

ఒక నిమిషం తర్వాత రాము మళ్ళీ వచ్చి "ఎలా వున్నావురా?" అని అడిగాడు.

"నేను బాగానే వున్నాను. ప్రతి నిమిష నిమిషానికి వచ్చి అలా అడుగుతావెందుకు?" అన్నాడు రమేష్.

"ఏంలేదు. మన దేశంలో ప్రతి నిమిషానికి పదిమంది చనిపోతున్నారుట" అందుకని.

## పడవ

## జోక్స్ కార్నర్

"నేను ఎన్ని కాగితాలతో పడవలు చేసి నీళ్ళల్లో వేసినా తిరిగి నా దగ్గరకే వస్తున్నాయి. ఎందుకు అలా జరుగుతోంది?" అంది రాణి బాధగా.

"బహుశా ఏ పత్రికా కార్యాలయం నుంచో వచ్చిన కథలోని కాగితాల్ని పడవలు చేసి వుంటావు" అన్నాడు భర్త.

